క్లుప్తంగా

పురపాలక శాఖ డైరెక్టర్‌ను కలిసిన నగర మేయర్



వరంగల్ అర్బన్: రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ పమేలా సత్పతిని నగర మేయర్ గుండు సుధారాణి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంక్ సాధించాలి

వరంగల్ అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్ సాధించేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ) పమేలా సత్పతి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సీడీఎంఏ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు పాల్గొన్నారు. మున్సిపాలిటీలకు సంబంధించిన ఎనిమిది అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. వీసీలో బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, సీహెచ్ఓ శ్రీనివాసరావు, సీఎంహెచ్ఓ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారికి ప్రశంస పత్రాలు




విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డికి, జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాంబాబుకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రశంస పత్రాలు, మెమొంటోలను అందజేశారు. కేడీసీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా పలుసార్లు రక్తదాన శిబిరాలను నిర్వహించి రెడ్‌క్రాస్‌కు 600 యూనిట్ల వరకు రక్తాన్ని అందించారు. దాంతో ఆ ఇరువురిని కలెక్టర్ అభినందించారు.

90 ఓపెన్ హార్ట్ సర్జరీలు చేసిన శ్రీనివాస్‌కు సన్మానం



వరంగల్: 90 ఓపెన్ హార్ట్ సర్జరీలను విజయవంతంగా చేసిన డాక్టర్ శ్రీనివాస్ ఆర్ దుస్సాను శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ రంగనాథ్, ఎమ్మెల్యే నరేందర్‌లు స్వాతంత్ర్య దినోత్సవంలో సన్మానించారు. 90 సర్జరీలు కూడా ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ పథకాల్లో సంరక్ష ఆస్పత్రిలో ఉచితంగా చేయించినందుకు హాస్పిటల్ యజమాన్యాన్ని సైతం అభినందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ దిడ్డి శ్రావణ్‌కుమార్, చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి, అజిత్‌మహ్మద్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె రవీందర్‌కు అభినందన



కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వడ్డె రవీందర్‌ను కేయూలో రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ బాధ్యులు బుధవారం అభినందించారు. ఇటీవల జరిగిన తెలంగాణ అకాడమీ ఆఫ్ ఆఫ్ సైన్స్ ఎన్నికల్లో 260 ఓట్లకు 190 ఓట్లు సాధించి రవీందర్ విజయం సాధించారు. యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ బాధ్యులు సాయికృష్ణ, ఫణికాంత్, రవి తదితరులు రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయ ప్రాతినిధ్యమే లక్ష్యంగా పద్మశాలీల పోరాటం



నయీంనగర్: రాబోయే రోజుల్లో రాజకీయ ప్రాతినిధ్యమే లక్ష్యంగా పద్మశాలి కులస్తుల పోరాటం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (టీఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్‌పీఎస్ పిలుపు మేరకు కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరి మహాసభకు లక్షలాదిగా తరలివచ్చిన పద్మశాలి కుల బాంధవులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాల్నె శరత్, చందా మల్లయ్య, బాసాని చంద్రప్రకాష్, సుదర్శన్ కూరపాటి, చిప్ప వెంకటేశ్వర్లు, బిట్ల రవీందర్, మెరుగు రాజు, దుస్సా శివశంకర్ పాల్గొన్నారు.

సంప్రదాయ వేడుకలకు వేదిక.. తెలంగాణ

హన్మకొండ: సంప్రదాయ వేడుకలకు తెలంగాణ.. వేదికగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ రాంనగర్ బంజారా కాలనీలో గిరిజన సంప్రదాయ పండుగ తీజ్ ఉత్సవాల్లో వినయ్‌భాస్కర్ బుధవారం పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సబ్బండ వర్గాలు తమ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సుగుణాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లావుడ్య రాందాస్, మోతీ, రాంచందర్, లింగా, మహిళలు జ్యోతి, గౌరి, బుజ్జి పాల్గొన్నారు.

తీజ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

హసన్‌పర్తి: బంజారా తీజ్ నవరాత్రి ఉత్సవాలు గోపాలపురంలో మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈనెల 24వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గోపాలపురంలోని సంత్ సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా యువతులు ప్రతిరోజు ఉపవాస దీక్ష చేస్తూ తీజ్ బుట్టల్లో నీరు పోస్తూ సేవాలాల్ మహరాజ్, మేరా మాతకు నైవేద్యాలు సమర్పించడం ఆచారం. చివరి రోజు తీజ్ నిమజ్జనం జరుగుతుంది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ రామోల్‌నాయక్, కోకన్వీనర్ గంగాధర్, రాంచంద్రానాయక్, రాజారాయ్ నాయక్, జవహర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న చీఫ్ విప్, తదితరులు



హసన్‌పర్తి: నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

వ్యాపారం, సామాజిక సేవలతోనే గుర్తింపు

వరంగల్: నగరంలో ఎంతోకాలంగా వ్యాపారంతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నందున స్వాతంత్ర్య దినోత్సవంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి జిల్లా పాలనా యంత్రాంగం ప్రత్యేకంగా ప్రశంసపత్రం అందించిందని చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి తెలిపారు. చాంబర్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆహారం, నిత్యావసర సరుకులను అందించినట్లు చెప్పారు. సమావేశంలో చాంబర్ ప్రతినిధులు మొగిలి చంద్రమౌళి, వేదప్రకాష్, సాగర్ల శ్రీనివాస్, అల్లె సంపత్, కంభంపాటి కుమారస్వామి, కటకం పెంటయ్య, యాదగిరి, గోపాల్‌రావు, కే.రవీందర్‌రెడ్డి, చింతలపల్లి వీరారావు, నాగభూషణం, రాజేష్ కరాణీ, హరినాథ్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

నాలా మార్కింగ్‌ను అడ్డుకున్న కాలనీవాసులు



కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

హన్మకొండ / హసన్‌పర్తి: హనుమకొండ రాజాజీనగర్, నయీంనగర్ పెద్ద మోరీ వరకు నాలాకు ఇరువైపులా చేస్తున్న మార్కింగ్‌ను కాలనీల వాసులు అడ్డుకున్నారు. ముందుగా నయీంనగర్ పెద్ద మోరీపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు చేపట్టి, ఆ తర్వాత నాలా మార్కింగ్, పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నెహ్రూనగర్, నందితారే నగర్, రాజాజీనగర్ కాలనీల వాసులు ఆందోళనకు దిగారు. వారికి స్థానిక కార్పొరేటర్ చాడ స్వాతి, బీజేపీ రాష్ట్ర నాయకుడు చాడా శ్రీనివాస్ రెడ్డి మద్దతు పలికారు. నాలా మధ్య నుంచి ఇరువైపులా 40 ఫీట్ల వెడల్పుతో మొత్తం నాలా 80 ఫీట్లు ఉండేలా కార్పొరేషన్ సిబ్బంది మార్కింగ్ చేస్తున్నారు. ఈక్రమంలో ఆయా కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. దాంతో వరంగల్ మహానగర పాలక సంస్థ ఈఈ రాజయ్య, సిటీ ప్లానర్ వెంకన్న, డీసీపీ ప్రకాష్‌రెడ్డి అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. నయీంనగర్ నాలాపై హైలెవల్ వంతెన నిర్మాణానికి 2021వ సంవత్సరంలో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడు?

వరంగల్ చౌరస్తా: లక్ష్మీపురం కాలనీవాసులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తానని, దావత్‌కు పిలవాలని హామీ ఇచ్చిన కేసీఆర్ మాటలు.. గారడీ మాటలుగా మారిపోయాయని బీజేపీ నాయకులు విమర్శించారు. ఇచ్చిన ఎన్నికల హామీలను ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశ్నించారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని 27వ డివిజన్ లక్ష్మీపురంలో బస్తీ బాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్, నాయకులు గంటా రవికుమార్, బాకం హరిశంకర్, పొట్టి శ్రీనివాస్ గుప్తా, కనుకుంట్ల రంజిత్, కాసు శిల్ప, సముద్రాల పరమేశ్వర్, గడల కుమార్, గోవింద్‌సింగ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



బస్తీ బాట కార్యక్రమంలో బీజేపీ నాయకులు

ప్రజలను బీఆర్ఎస్ మోసం చేస్తోంది

హసన్‌పర్తి: బీఆర్ఎస్ సర్కార్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని మాజీ సర్పంచ్, ఒకటవ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దేవరకొండ అనిల్‌కుమార్ విమర్శించారు. బీజేపీ పిలుపు మేరకు డివిజన్‌లో బస్తీ బాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

మంద కృష్ణపై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు

హన్మకొండ: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అగ్రకుల అహంకారానికి నిదర్శనమని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న విమర్శించారు. నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వేల్పుల సూరన్న మాట్లాడుతూ మాలలకు కొమ్ముకాస్తూ మాదిగల ఆత్మగౌరవం దెబ్బతినేలా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాయకులు సుకుమార్, దినేష్ మాదిగ, చేతల్ల శివ, రాజారపు కిరణ్, మంద వర్ధన్ పాల్గొన్నారు.

మాదిగలపై రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధి చాటుకోవాలి

కాశిబుగ్గ: మాదిగలపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధి చాటుకోవాలని, ఎస్సీ వర్గీకరణకు నివేదిక ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ వద్దకు వెళితే ఆయన స్పష్టత ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని ఎంఎస్పీ వరంగల్ తూర్పు ఇన్‌చార్జ్ ఈర్ల కుమార్‌మాదిగ అన్నారు. వరంగల్ 18వ డివిజన్ ప్రతాప్‌నగర్ కమిటీ హాల్‌లో ఎంఎస్పీ, ఎంఆర్‌పీఎస్ ఆధర్యంలో బుధవారం సమావేశం జరిగింది.



హన్మకొండ: మాట్లాడుతున్న వేల్పుల సూరన్న

విద్యుత్ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం



రెహ్మాన్‌ను సన్మానిస్తున్న శ్రీధర్, నాయకులు

హన్మకొండ: విద్యుత్ ఆపరేషన్స్, మెయింటెనెన్స్ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదల తీవ్రతతో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో ప్రాణాలకు తెగించి ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ క్రమంలో చెరువు మధ్యలోకి వెళ్లి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన దేవరుప్పుల జూనియర్ లైన్‌మెన్ ఎండీ.రెహ్మాన్‌కు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఉత్తమ ఉద్యోగి అవార్డు అందించి అభినందించారని అన్నారు. ఈమేరకు ఎండీ.రెహ్మాన్‌ను హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని టీఎస్ ఈఈయూ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇనుగాల శ్రీధర్‌తోపాటు నాయకులు సన్మానించారు. అదే విధంగా ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న జనగామ ఎస్ఈ తక్కళ్లపల్లి వేణుమాధవ్, స్టేషన్ ఘనపూర్ జూనియర్ లైన్‌మెన్ అశోక్‌ను అభినందించారు. అలాగే, దేవరుప్పుల సెక్షన్ జూనియర్ లైన్‌మెన్ ఎండీ.రెహ్మాన్‌ను హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ గోపాల్‌రావు సన్మానించారు.

వ్యాయామ పరికరాల ఏర్పాటు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలోని పార్కులో మున్సిపల్, కుడా అధికారుల పర్యవేక్షణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కాలనీవాసుల ఆకాంక్ష మేరకు పార్కులో పలు సౌకర్యాలను కల్పిస్తున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ సూచన మేరకు కూర్చోవడానికి సిమెంట్ బెంచీలతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపడుతున్నారు. డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు సహకారంతో పిల్లలు కోసం ఆట వస్తువులను ఏర్పాట్లు చేస్తున్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చందర్‌రావు

వరంగల్ చౌరస్తా: పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించేలా పార్లమెంట్‌లో చట్టం చేసి తక్షణమే అమలు చేయాలని ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. వరంగల్ అబ్బనికుంటలో తెలంగాణ రైతు భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17, 18వ తేదీల్లో వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర స్థాయి సదస్సులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రైతులకు ఓటు హక్కు కల్పించడం, పసుపు, మిర్చి పంటలకు మద్దతు ధర, రైతు ఆత్మహత్య కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వంటి పలు అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు బాషపాక రమేష్, కోశాధికారి కూస సంపత్ కుమార్, తిరుపతి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వాయి పాపన్న జయంతి

కరీమాబాద్ : వరంగల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలి

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇతర పనులపై వాహన చోదకులు భారీ సంఖ్యలో బుధవారం తరలివచ్చారు. జీరో కౌంటర్లల్లో గంటల తరబడి నిరీక్షించారు. కౌంటర్లు నాలుగు ఉన్నప్పటికీ ఇద్దరు అధికారులు మాత్రమే అందుబాటులో ఉండడంతో జాప్యం జరిగింది. దాంతో ఆర్టీఓ ఆఫ్రిన్ సిద్ధిఖీకి ఫిర్యాదు చేశారు. ఆమె వెంటనే స్పందించి మరో రెండు కౌంటర్ల ఏర్పాటు చేయించడంతోపాటు మధ్యాహ్నం 2గంటలకు ముగించాల్సిన కౌంటర్‌ను 4గంటల వరకు సమయాన్ని పొడిగించారు.

ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి

ఎంజీఎం: వైద్య, ఆరోగ్య శాఖలో 20ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కాజీపేట: కాజీపేట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి ఫాతిమానగర్ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేకల రాజయ్య (56) అనే గొర్రెల కాపారి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండెడు గ్రామానికి చెందిన రాజయ్య ఇటీవల కొద్దిరోజుల కింద గొర్రెల మేత కోసం ధర్మసాగర్ మండల కేంద్రానికి చేరుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న కూతురును చూసి ధర్మసాగర్‌కు తిరిగి బుధవారం ఆటోలో వెళ్తుండగా ఓ స్కూల్ బస్సు ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయాడు. క్షతగాత్రుడిని స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు.

డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్ కమిటీని నగరం బాలసముద్రంలోని పెట్ పార్కులో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్యాల దేవేందర్, ప్రధాన సలహాదారుడిగా వీరారెడ్డి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రౌతు గౌతమ్, ఉపాధ్యక్షులుగా బల్మూరి మారుతిరావు, పింగిలి ఆదిత్యరెడ్డి, పులి గిరీష్, బొజ్జ రాజు, జింక రమేష్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్ కృష్ణ, వల్లాల శ్రీకాంత్ గౌడ్, బంటరి అరుణ్, కోశాధికారిగా శ్యాంసుందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రాంగిరి దిలీప్, కరిమిల్ల వంశీరావు, జన్ను ప్రశాంత్, కొట్టె శ్రీధర్, సిలివేరు సక్సేనా, ఎలగందుల అయ్యప్ప, వీర్ల అశోక్, జానపట్ల లక్ష్మిని ఎన్నుకున్నారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హసన్‌పర్తి: హసన్‌పర్తి వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా పావుశెట్టి వెంకటేశం, అధ్యక్షుడిగా ఆకుతోట రమేష్, ఉపాధ్యక్షులుగా బరుపటి జగదీశ్వర్, ఎడ్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఆరెల్లి వెంకటస్వామి, సహాయ కార్యదర్శులుగా సతీష్, వేల్పుల సంపత్, కోశాధికారిగా కోడెల మురళి, మీడియా కన్వీనర్‌గా కందుకూరి సంజీవ్, సలహాదారులుగా కుమారస్వామి, రెబల్లి ఓంప్రకాష్, వెంకటయ్యతో పాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల ఇన్‌చార్జ్ రాంచంద్రారెడ్డి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మామునూరు: ఖిలా వరంగల్ మండలం నక్కలపెల్లి గ్రామంలో జాతీయ జెండాను, అంబేడ్కర్ ఫొటోను అవమానపర్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఉసిల్ల దయాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గ్రామంలో మాల మహానాడు జిల్లా ప్రతినిధుల ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు.

ఉచిత అల్పాహారం

హసన్‌పర్తి: లయన్స్ క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో హసన్‌పర్తి సెంటర్‌లో బుధవారం ఉచిత అల్పాహారం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎలక్రాజు శ్రీకాంత్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ లీడర్‌షిప్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అజిత్‌కుమార్, క్లబ్ కార్యదర్శి ఇనుముల కృపాకర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

హోంగార్డులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

కాజీపేట: హోంగార్డులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేలా సీఎం కేసీఆర్‌ను ఒప్పించాలని హోంగార్డు సంఘం నాయకులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హనుమకొండలో కలిసి వినతిపత్రం అందజేశారు.

వరద బాధితులకు రిటైర్డ్ ప్రొఫెసర్ల చేయూత

కేయూ క్యాంపస్: వరద బాధితులకు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా)లో సభ్యులుగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్లు చేయూతనందించారు. వారంతా కలిసి సుమారు రూ.2 లక్షల 20 వేలతో మృతుల కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం, అలాగే సుమారు 100 కుటుంబాలకు దుప్పట్లతోపాటు దుస్తులు అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచ సమీపంలోని చెంచుకాలనీ, ములుగు జిల్లాలోని బూర్గుపేట, వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట, పస్రా సమీపంలోని ప్రాజెక్టు నగర్‌లో, ఏటూరు నాగారం సమీపంలోని కొండాయిలోని వరద బాధితులను కుర్తా బాధ్యులు కలిసి సాయం చేసినట్లు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ కాకతీయ యూనివర్సిటీలో బుధవారం వెల్లడించారు. కుర్తా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, కార్యవర్గ సభ్యుడు ప్రొఫెసర్ సుధాకర్ పాల్గొన్నారు.



కిట్‌తోపాటు రూ.5వేలు అందజేస్తున్న బాధ్యులు

భారత రాజకీయాల్లో వాజ్‌పేయి ఓ మణిహారం



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న నాయకులు

హన్మకొండ: భారత రాజకీయాల్లో భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి ఒక మణిహారమని, ప్రజాస్వామ్యాన్ని బతికించిన మహానీయుడు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి కొనియాడారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో అటల్ చిత్రపటానికి రాకేష్ రెడ్డి, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరీశంకర్, శివరాం, అభిషేక్, రూప్‌సింగ్, కిరణ్, సతీష్‌రెడ్డి, అటల్ ఫౌండేషన్ సభ్యులు పురుషోత్తం, రణధీర్, వినయ్, గణేష్, రాజు, కిరణ్, నాగరాజు, వంశీ పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

వరంగల్ చౌరస్తా: వాజ్‌పేయి వర్ధంతిని వరంగల్ 27వ డివిజన్‌లో గోవిందరాజుల గుట్ట వద్ద బీజేపీ నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, నాయకులు గంట రవి, సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, పొట్టి శ్రీనివాస్ గుప్తా, గడల కుమార్, వెంకటేశ్వర్లు కందిమల్ల మహేష్, గోకె వెంకటేష్, బైరి మురళి, తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకంలో పైరవీలు

హసన్‌పర్తి: గృహలక్ష్మి పథకం ఎంపిక కోసం హసన్‌పర్తిలో మండల పరిధిలో పైరవీలు ప్రారంభమయ్యాయి. ప్రజల నుంచే కాకుండా ప్రజాప్రతినిధుల నుంచి కూడా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విచారణాధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అనర్హులకు జాబితాలో చోటు కల్పిస్తున్నారని చెబుతున్నారు. కొంతమంది బ్రోకర్లు ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హసన్‌పర్తి మండలంలోని 15 గ్రామాల్లో గృహలక్ష్మి పథకానికి సుమారు రెండువేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. గృహలక్ష్మి పథకం సందర్భంగా చేపడుతున్న విచారణలో విచారణాధికారి తీరుపై స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు కొంత మంది ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై హసన్‌పర్తి మండల అభివృద్ధి అధికారి రామకృష్ణను అడగగా, పాదర్శకంగా విచారణ చేపడుతున్నట్లు చెప్పారు. మండల పరిషత్ అధికారి రామకృష్ణపై వేటుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

విదేశీ విద్యకు దరఖాస్తులు

కాళోజీ సెంటర్ : విదేశీ విద్య కోసం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయానికి వరంగల్ జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పి.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా విద్యార్థులు యూఎస్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్ దేశాల్లో చదువుకునేందుకు వీలుందని పేర్కొన్నారు. విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తులను వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.